క్లుప్తంగా

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండలో పునఃనిర్మాణంలో ఉన్న శ్రీకాశి విశ్వేశ్వరస్వామి దేవాలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను నిర్వహించనున్నారు. శివలింగ, నూతన నంది విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మోడల్ స్కూలు దరఖాస్తుల గడువు పెంపు

శంషాబాద్ రూరల్: మండలంలోని పాల్మాకులలో ఉన్న మోడల్ స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంచినట్లు.. ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విష్ణుప్రియ తెలిపారు. ఏడు నుంచి పదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం గురువారం అడ్మిషన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు స్థానికుల కృతజ్ఞతలు



శంషాబాద్: శంషాబాద్ సిద్ధాంతి వద్ద జటిలమైన సమస్యగా మారిన ఫ్లైఓవర్ విషయంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లు సమస్య పరిష్కారానికి బాటలు వేసినందుకు గాను కృతజ్ఞతగా ఆయనను స్థానిక కౌన్సిలర్ మేకల్ వెంకటేష్ ముదిరాజ్ తదితరులు కలిశారు. సమస్యలను వీలైనంత త్వరగా సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లాలని కోరారు.

19న ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర



మంత్రి సబితాఇంద్రారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న యువ సమితి సభ్యులు

రాజేంద్రనగర్: ఛత్రపతి శివాజీ మహారాజ్ యువ సమితి ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. శోభాయాత్రలో పాల్గొనాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను ప్రత్యేకంగా వెళ్లి ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర ఈ నెల 19న వేడుక నిర్వహిస్తామన్నారు.

సీబీఐటీలో ఎలక్ట్రికల్ సదస్సు

మణికొండ: గండిపేటలోని సీబీఐటీ కళాశాలలో బుధవారం ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్స్‌లో ఉద్యోగావకాశాలు అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ సీఈఓ కె. మదన్‌మోహన్ హాజరయ్యారు. ఎలక్ట్రికల్ డిజైన్ అనేది వివిధ లైటింగ్ పరికాలు, విద్యుత్ వ్యవస్థ, ప్రవాహం, భద్రతా వ్యవస్థ, ఎలక్ట్రానిక్ కాంపోనెంట్స్, వాయిస్, డేటా కమ్యూనికేషన్స్‌లకు ఎంతో ముఖ్యమన్నారు.కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.సురేష్‌బాబు, సహాయ ప్రొఫెసర్ ఎస్. సంతోష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ అప్పగించిన బాధ్యతలు నిర్వహిస్తా

మైలార్‌దేవ్‌పల్లి: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో బీజేపీ విప్‌గా మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డిని పార్టీ అధిష్టానం నియమించింది. బుధవారం ఈమేరకు ఆయనకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కౌన్సిల్ విప్‌గా తనను నియమించటం ఆనందంగా ఉందని, పార్టీ అధిష్టానం అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తానన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన అన్నారు. కార్వాన్ మర్చంట్ అసోసియేషన్ వారు బుధవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలుసుకుని సన్మానించారు. ఈ సందర్భంగా వారు కార్వాన్ డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని విన్నవించారు. కార్వాన్ మెయిన్ రోడ్డుపై కొన్ని రోజులుగా డ్రైనేజీ ప్రవహిస్తుందని, దీంతో రోడ్డు కూడా దెబ్బతిందని వారు ఆయనకు వివరించారు. రోడ్డు పక్కన ఉన్న షాపులవారు రోడ్డుపై మురుగుతో ఎన్నో ఇబ్బందులుపడుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.

కలగానే మిగిలిన పోలీస్‌స్టేషన్





రెండు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని కాళీమందిర్ ప్రాంతం



రాజేంద్రనగర్, నార్సింగి పోలీస్‌స్టేషన్ల పరిధి మధ్య ఉన్న జాతీయ రహదారి

బండ్లగూడ: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీస్‌వ్యవస్థను తీర్చిదిద్దే పనిలో అధికారులు కొత్తగా జోన్లు, డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పెంపుపై దృష్టిసారించి ఏర్పాటుచేశారు. కానీ బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కొత్త పోలీస్‌స్టేషన్ కలగానే మిగిలిపోయింది. గతంలో అధికారులు హిమాయత్‌సాగర్‌లో ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినా అటకెక్కింది.

రెండు పోలీస్ స్టేషన్ పరిధిలో బండ్లగూడ జాగీర్..

కార్పొరేషన్ పరిధి ప్రధాన జాతీయ రహదారి రోడ్డుకు ఇవతల ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటే మరోపక్క వేరే పోలీస్ స్టేషన్ పరిధికి వస్తుంది. దీంతో కొత్తగా వచ్చేవారు ఏదైనా ఫిర్యాదు చేయవలసి వస్తే ఏ పోలీస్ స్టేషన్ వెళ్లాలో అర్థం కాని పరిస్థితి ఎదురవుతోంది.

కార్పొరేషన్ పరిధి 1.50 లక్షలకు పైగా జనాభా..

ప్రస్తుతం కార్పొరేషన్ పరిధి 1.50 లక్షలకు పైగా జనాభా ఉన్నట్టు అంచనా 31,548 నివాసగృహాలు ఉండగా 200 వరకు కాలనీలు ఉన్నాయి. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్‌సాగర్, బండ్లగూడ తదితర ప్రాంతాలు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండగా హైదర్‌షాకోట్, పీరంచెరువు, గంధం గూడ, బైరాగి గూడ తదితర ప్రాంతాలు నార్సింగి స్టేషన్ పరిధిలోకి వస్తాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గం రెండు ప్రాంతాల్లో పోలీస్‌స్టేషన్లు కావాలని ప్రతిపాదనలు పంపినా అత్తాపూర్‌కు మాత్రం అనుమతులు రావడంతో ఏర్పాటు చేశారు. బండ్లగూడ జాగీర్ మాత్రం పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

కారు అద్దాలు పగులగొట్టి దొంగతనం



రాజేంద్రనగర్: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన ఓ కుటుంబ సభ్యుల విలువైన బంగారు ఆభరణాలతో పాటు నగదును దొంగలించిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బారాత్‌లో కుటుంబ సభ్యులతో నృత్యాలు చేస్తుండగా దొంగలు కారు అద్దాలు పగులగొట్టి 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు, వస్త్రాలను దొంగలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హైదర్‌గూడ న్యూఫ్రెండ్స్ కాలనీకి చెందిన శ్రీనివాస్ తన కూతురు వివాహాన్ని నగరంలోని ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. రాత్రి బారాత్‌ను న్యూఫ్రెండ్స్ కాలనీ నుంచి నిర్వహించారు.బారాత్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులంతా పాల్గొన్నారు. బంజారాహిల్స్‌కు చెందిన కిరణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు. వివాహం అనంతరం తన భార్య, కూతురు తనకు సంబంధించిన 15తులాల బంగారు ఆభరణాలను ఒక హ్యాండ్ బ్యాగులో భద్రపరిచారు. రూ.20 వేల నగదుతో పాటు పెళ్లికి సంబంధించిన వస్త్రాలను తన ఐ–10 కారులో భద్రపరిచి లాక్ వేశాడు. ఈ వాహనాన్ని కాలనీ ప్రధాన రహదారి పక్కనే పార్కు చేశాడు. వేడుక ముగిసిన అనంతరం కారు వద్దకు వెళ్లి చూడగా కారు అద్దాలు పగులగొట్టి ఉన్నాయి. భద్రపరిచిన 15 తులాల బంగారు ఆభరణాలు, నగదు, నూతన వస్త్రాలు కనిపించలేదు. దీంతో రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న అన్నపూర్ణదేవి ప్రతిష్ఠాపన పూజలు



మణికొండ: పుప్పాలగూడ కాశీవిశ్వేశ్వరాలయం ఆవరణలో అన్నపూర్ణదేవి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వేద మంత్రోచ్ఛరణలతో గ్రామం మార్మోగుతోంది. పూజలలో రెండవ రోజు బుధవారం ఉదయం స్వస్తి వాచనము, స్థాపిత దేవత పూజలు, నవగ్రహ మాతృక యోగిని, వాస్తు క్షేత్రపాలక బ్రహ్మోది మండల దేవతా హవనములు, క్షీరాధివాసము, హారతి మంత్రపుష్పంను నిర్వహించారు.

కార్పొరేటర్ పర్యటన



కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని భవానీ కాలనీ, న్యూ భవానీ కాలనీలలో బుధవారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. భవానీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీలోని పార్కు ప్రాంగణంలో పుట్‌పాత్, పార్కింగ్ పుట్‌పాత్, స్ట్రీట్ లైట్స్ కల్పించాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అడికే జనార్థన్, లక్ష్మణ్, మోహన్, నీలకంఠం పాల్గొన్నారు.

రైతు కుటుంబాల సంక్షేమానికి కృషి చేయాలి



అధికారులతో వ్యవసాయ శాఖ రాష్ట్ర కార్యదర్శి రఘునందన్‌రావు

ఏజీవర్సిటీ: రైతు కుటుంబాల సంక్షేమ కోసం ప్రభుత్వాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు,వ్యవసాయ విశ్వవిద్యాలయాలు,వ్యవసాయ అధికారులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రైతు ప్రపంచలోనే అతి పెద్ద అశావాది అని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు అన్నారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్)లో సాంకేతిక శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో దాదాపు 90 మంది అధికారులు పాల్గొన్నారు. తెలంగాణలో పంటల విస్తీర్ణం పెరిగిందని రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అదించడానికి వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉన్నారని వారి సేవలు రైతులు వినియెగించుకోవాలని తెలిపారు.

కంటివెలుగుతో ఎంతో మేలు



కంటి అద్దాలను అందిస్తున్న కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్

మణికొండ: అనేక కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నవారికి కంటి వెలుగు కార్యక్రమంలో ఎంతో మేలు చేస్తుందని నార్సింగి మున్సిపాలిటీ 8వ వార్డు కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన వార్డు పరిధిలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తీసుకుంటున్న ఆహారంలో సమతుల్యత లేకపోవటంతో అనేక కంటి సమస్యలు వస్తున్నాయన్నారు.

సద్దుమణిగిన ఉద్రిక్తత

చార్మినార్: మీరాలంమండి కూరగాయల మార్కెట్‌లోని ప్రభుత్వ స్థలంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు ప్రైవేటు వ్యక్తులకు అద్దె చెల్లించాల్సిన అవసరం లేదని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. ప్రభుత్వ భూమిలో అక్రమంగా కబ్జాకు పాల్పడి ఇతరులు వ్యాపారాలు నిర్వహించుకోవడం కోసం స్థలాన్ని ఇచ్చి నెల నెలా అద్దె వసూలు చేస్తున్న విషయంపై బుధవారం ఉదయం మీరాలంమండిలో కొంతమందికి వాగ్వాదం జరిగింది. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పరిస్థితి అదుపు తప్పుతుందని తెలుసుకున్న ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్‌తో పాటు పత్తర్‌గట్టి కార్పొరేటర్ సోహేల్ ఖాద్రీ ఘటన స్థలానికి చేరుకొని అక్కడి వారికి నచ్చ చెప్పారు. అలాగే విషయం తెలిసిన వెంటనే మీర్‌చౌక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఒక వ్యక్తి అక్రమంగా అద్దె వసూలు చేస్తున్న విషయాన్ని తన దృష్టికి తెచ్చారన్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకునేంత వరకు వ్యాపారాలు కొనసాగించవచ్చునని ఆయన స్పష్టం చేశారు.

మాస్టర్‌ప్లాన్ ప్రకారమే రోడ్డును విస్తరించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీల ప్రతినిధులు

మణికొండ: ఫ్రెండ్స్ కాలనీ నుంచి గీతాంజలి పాఠశాల వరకు విస్తరిస్తున్న రోడ్డును మాస్టర్ ప్లాన్ ప్రకారమే విస్తరించాలని, అందుకు విరుదద్ధంగా ఒకవైపే విస్తరిస్తే దాన్ని సమ్మతించబోమని స్థానికులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బుధవారం ఆయనను సాయిరాంకాలనీ, మణికొండ క్వార్టర్స్, ఫ్రెండ్స్‌కాలనీ, ఎంప్లాయిస్‌కాలనీ, పోచమ్మకాలనీ, అంజలిగార్డన్, లక్ష్మీనర్సింహా కాలనీలకు చెందిన ప్రతినిధులు మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు గతంలోనే మంచినీటి పైప్‌లైన్‌లు ఉన్నాయని తమ స్థలాలకు సెట్‌బ్యాక్‌లు తీసుకుని అనుమతులు ఇచ్చారనాన్నారు. అయితే ప్రస్తుతం తిరిగి మా ఒక్క వైపే రోడ్డును విస్తరించాలనుకోవటం మంచి పద్ధతి కాదన్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లో గండిపేట క్యాండూట్‌కు ఇరువైపులా రోడ్డును చూపారని, దాని ప్రకారమే పనులు చేపట్టాలని కోరారు.

కాలనీ సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కాలనీ అసోసియేషన్ సభ్యులు

బండ్లగూడ: బండ్లగూడ కార్పొరేషన్ పరిధిలోని హిమగిరినగర్ కాలనీలో సమస్యలతో సతమతమౌతున్నామని మా సమస్యలు పరిష్కరించాలని కాలనీ ఫేస్2 అసోసియేషన్ అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో కమిషనర్‌కు వినతి పత్రం ఇచ్చారు. కాలనీలో తాగునీటి కొరత ఉందని సమయానికి నీరు కావడం లేదని అలాగే కుక్కల బెడద చాల ఉందని పిల్లలు బయట తీరుగలేక పోతున్నామని వరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సునీల్ పాల్గొన్నారు.

బ్లూక్రాస్‌తో నార్సింగి మున్సిపాలిటీ ఒప్పందం

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో జంతు జనన నియంత్రణ, వీధి కుక్కలకు యాంటీ రాబిస్ టీకాలు ఇచ్చేందుకు బ్లూక్రాస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని నార్సింగి మున్సిపల్ కమిషనర్ ఎ.సత్యబాబు తెలిపారు. బుధవారం అందుకు అవసరమైన ఒప్పందాన్ని బ్లూక్రాస్ ప్రతినిధితో అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వీధి కుక్కల సంఖ్యను పెరగకుండా చేయటంతో పాటు అవి కరిచినా ప్రజలకు రేబీస్ సోకకుండా ఉంటుందన్నారు.



సేవాలాల్ సేవలు మరువలేనివి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్‌తండాలో బుధవారం సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ 284వ జయంతి పురస్కరించుకుని నిర్వహించిన భోగ్ బండారో కార్యక్రమంలో ఎమెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. సేవాలాల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని ఆయన అన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తన్వీరాజు, వైఎస్ ఎంపీపీ నీలా, టీవీ కళాకారులు జబర్దస్త్ చమ్మక్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ: మహనీయులను ఆదర్శంగా తీసుకొని నేటి యువత వారి అడుగుజాడల్లో నడవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. ఎర్రకుంట తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వేడుకల్లో పాల్గొన్న మేయర్ మహేందర్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమాలను బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. బాబుల్‌రెడ్డినగర్‌లో జరిగిన వేడుకల్లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

శివానీలను కస్తూర్బా గాంధీకు తరలించిన అధికారులు

బండ్లగూడ: రాజేంద్రనగర్ జోన్ సాక్షి పత్రికలో ప్రచురితమైన తప్పిపోయిన మహిళను చేరదీసిన కపిలానగర్ వాసులు అనే శీర్షికకు అధికారులు స్పందించారు. అంతరెడ్డిగూడ ప్రాంతానికి చెందిన శివనీల(28) తప్పిపోయి తన ఆరు నెలల పసిపాపతో రోడ్డుపై స్పృహ కోల్పోవడంతో ఆమెకు ఆశ్రయం కల్పించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం పోలీసు అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు శివనీలను హైదర్షాకోట్‌లోని కస్తూర్బా గాంధీ ట్రస్టుకు తరలించారు.



కస్తూర్బాగాంధీ మెమోరియల్ ట్రస్ట్‌లో శివనీలతో పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లు, నిర్వాహకులు

కంటి సమస్యలు పరిష్కరించేందుకే కంటి వెలుగు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. బుధవారం కార్పొరేషన్ 4వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని కార్పొరేటర్ రవీందర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కంటి సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు.



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

మలబార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్స్



విద్యార్థులతో మలబార్ ట్రస్ట్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: ఆర్థికంగా వెనుకబడి ప్రభుత్వ కళాశాలలో చదివే నిరుపేద బాలికలకు మలబార్ ట్రస్ట్ ఆర్థికంగా చేయూతనిచ్చింది. రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే 184 మంది పేద విద్యార్థులకు మలబార్ ట్రస్ట్ 15 లక్షల రూపాయల స్కాలర్‌షిప్స్‌ను అందజేసింది. ఆర్థికంగా వెనుకబడి మంచి మార్కులతో పాసైన విద్యార్థులు, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ప్రాధాన్యేత ఇచ్చి 15 లక్షలు నేరుగా స్టూడెంట్స్ ఖాతాల్లో జమ చేశారు. కార్యక్రమంలో మలబార్ స్టోర్ హెడ్ రమీజ్, మార్కెటింగ్ మేనేజర్ జావీద్ పాల్గొన్నారు.

జూ చూసొద్దాం రండి



ఎన్‌క్లోజర్‌లో సరదాగా గడుపుతున్న కోతులు



జూ పార్కులోని కొలనులో కొంగలు

- ఇక ఆన్‌లైన్ బుకింగ్‌తో జూ సందర్శన ఈజీ
- సందర్శకులకు విజ్ఞానంతో పాటు ఆహ్లాదాన్ని పంచుతున్న జూ పార్కు

చార్మినార్: పాతబస్తీలోని నెహ్రూ జులాజికల్ పార్కును సందర్శించడానికి చిన్నారులతో పాటు పెద్దలు సైతం ఇష్టపడతారు. ప్రస్తుతం జూ సందర్శనకు ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ అందుబాటులోకి వచ్చింది. దీంతో ప్రస్తుతం మనం ఎక్కడి నుంచైనా జూ సందర్శన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా ముందుగానే బుక్ చేసుకోవచ్చు. జూ బుకింగ్ కౌంటర్ వద్ద ఉండే చాంతాడంత క్యూలతో ఇబ్బంది పడాల్సిన అవసరం ఇక లేదు. నెహ్రూ జూలాజికల్ పార్కు ఓ ఎంటర్‌టైన్ మెంట్ పార్కుగా కాకుండా సందర్శకులకు ఆహ్లాదం, వినోదంతో పాటు జంతువు, పక్షులపై కొత్త విషయాలను నేర్చుకునే విద్యాలయంగా చెప్పవచ్చు. దీంతో జూ సందర్శకుల రద్దీ కూడా పెరిగింది. అప్పుడప్పుడు వచ్చే పాఠశాలలు, కళాశాలలకు సెలవులతో పాటు వీకెండ్ రోజుల్లో జూపార్కును సందర్శించే సందర్శకుల సంఖ్య అధికంగా ఉంటుంది. కేవలం కాలక్షేపం కోసమే కాకుండా జంతు ప్రపంచం గురించి తెలుసుకునే విజ్ఞాన యాత్రగా జూ పార్కు సందర్శన ఉంటుంది.

జూ సందర్శనకు పెరిగిన ఆసక్తి..

జూలో లేని జంతువు, పక్షులను రప్పించేందుకు, జంతువు, పక్షుల సంతానోత్పత్తి చేపట్టడం ప్రారంభించాక జూ సందర్శన పట్ల సందర్శకుల్లో అమితమైన ఆసక్తి పెరిగింది. అత్యంత విషతుల్యమైన పాములు, విషం లేని పాములను స్నేక్ సెల్ బృందం ప్రదర్శిస్తూ వాటి వివరాలను సందర్శకులకు తెలియజేస్తూ పాముల పట్ల సందర్శకులకు ఉన్న అపోహలను తొలగిస్తున్నారు. ఇదే కాకుండా వన్య ప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ వన్యప్రాణులను దత్తత తీసుకునే వెసలుబాటును కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కవర్లపై సందర్శకులను చైతన్యవంతులను చేస్తూ ప్లాస్టిక్ నివారణకు కృషి చేస్తున్నారు. సందర్శకులు రోజంతా ఉపశమనం పొందడమే కాకుండా ఆహ్లాదకరమైన చల్లని వాతావరణాన్ని ఆస్వాదిస్తూ వన్య ప్రాణులను తిలకించడమే కాకుండా అనేక విషయాలను తెలుసుకోవడం లాంటి అనుభూతులను జూను సందర్శిస్తే కాని తెలియదు.

జూపార్కులో సౌకర్యాలు..

జూపార్కును అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతరించిపోయే జంతువు, పక్షుల సంతానోత్పత్తిని చేపట్టేందుకు జూపార్కు కేంద్రబిందువుగా ఉంది. చిన్నారులు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కు, సేద తీరేందుకు పచ్చిక బయళ్లు, రచ్చబండలు, సహాపంక్తి భోజనాలు చేసేందుకు పచ్చని తోరణాలతో విచ్చుకున్న పచ్చదనం జూపార్కు అందచందాలను తిలకించేందుకు విజిటర్ వ్యాన్, లయన్ సఫారీ, చిట్టి రైలు అందుబాటులో ఉన్నాయి.